PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక 218 | పేజీలు : 8 | వెల రూ.5 | మంగళవారం 01.09.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh




WANTED REPORTERS

## పెన్షన్‌దారులకు భారీ శుభవార్త

దరఖాస్తు గడువు మరో 15 రోజులు పొడిగింపు

మంత్రి సీతక్క ఆదేశాలతో నిర్ణయం

అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అధికారుల సూచన




హైదరాబాద్-ప్రభాత సూర్యుడు : పెన్షన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. పెన్షన్‌కు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ గడువును మరో 15 రోజులు పొడిగించింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారితో పాటు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన వారికి కూడా ఈ గడువు పొడిగింపు ద్వారా అవకాశం లభించనుంది. దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచడంతో పెన్షన్ పొందేందుకు అర్హత ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. వివిధ కారణాలతో ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేకపోయిన వారు ఆలస్యం చేయకుండా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను సంప్రదించి తెలుసుకోవచ్చని తెలిపారు. పెన్షన్‌దారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సులభతరం చేయాలని అధికారులు సూచించారు. గడువు మరో 15 రోజులు మాత్రమే పొడిగించినందున అర్హులైన వారు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులకు మరో అవకాశం లభించినట్లయింది.



# నగర వాసులకు ఊరట

అందుబాటులోకి మూసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జి

రూ.52 కోట్లతో 400 మీటర్ల పొడవున నిర్మాణం

అంబర్‌పేట-దిల్‌సుఖ్‌నగర్ మార్గంలో రాకపోకలు



హైదరాబాద్-ప్రభాత సూర్యుడు : మూసీ నదిపై అంబర్‌పేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ మార్గంలో నిర్మించిన మూసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వంతెనను ప్రారంభించారు. అనంతరం ప్రజాప్రతినిధులతో కలిసి వంతెనను పరిశీలించిన ముఖ్యమంత్రి.. నిర్మాణ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంతెన నిర్మాణానికి సంబంధించిన ఫొటో ప్రదర్శనను కూడా తిలకించారు. ఈ సందర్భంగా వంతెన నిర్మాణం, దాని ద్వారా అందుబాటులోకి రానున్న రవాణా సౌకర్యాలపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

### రూ.52 కోట్లతో 400 మీటర్ల పొడవున నిర్మాణం

మూసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జిని రూ.52 కోట్ల వ్యయంతో నిర్మించారు. మొత్తం 400 మీటర్ల పొడవుతో నిర్మించిన ఈ వంతెన అంబర్‌పేట--దిల్‌సుఖ్‌నగర్ మార్గంలో కీలకమైన రవాణా సౌకర్యంగా మారనుంది. మూసీ నదిపై నిర్మించిన ఈ వంతెన ద్వారా ఈ రెండు ప్రాంతాల మధ్య రాకపోకలకు మరింత సౌలభ్యం కలగనుంది. నగరంలో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని రహదారి మౌలిక వసతులను మెరుగుపరిచే చర్యల్లో భాగంగా ఈ వంతెన నిర్మాణాన్ని చేపట్టారు. వంతెన అందుబాటులోకి రావడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు ప్రత్యామ్నాయ రాకపోకల సౌకర్యం లభించడంతో పాటు రద్దీ సమయంలో ప్రయాణం సులభతరం కానుంది.

### అంబర్‌పేట--దిల్‌సుఖ్‌నగర్ ప్రయాణికులకు ఊరట

అంబర్‌పేట, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల మధ్య ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. కొత్తగా నిర్మించిన హై లెవల్ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో వాహనదారులకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. వంతెన వినియోగంలోకి రావడంతో ఆయా ప్రాంతాల మధ్య అనుసంధానం మెరుగుపడటంతో పాటు ప్రయాణ సమయం తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నగరంలోని తూర్పు ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు కూడా ఈ వంతెన ఉపయోగకరంగా మారనుంది. మూసీ నదిపై నిర్మించిన ఈ వంతెన భవిష్యత్‌లో ఈ ప్రాంత రవాణా అవసరాలకు అనుగుణంగా కీలక మౌలిక వసతిగా నిలవనుంది. మూసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, మల్‌రెడ్డి రంగారెడ్డి, శ్రీగణేష్, నవీన్ యాదవ్ పాల్గొన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వంతెనను పరిశీలించి నిర్మాణ వివరాలను తెలుసుకోవడంతో పాటు ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఈ కొత్త రవాణా సౌకర్యాన్ని పరిశీలించారు. వంతెన ప్రారంభంతో అంబర్‌పేట--దిల్‌సుఖ్‌నగర్ మార్గంలో రాకపోకలు మరింత సులభతరం కావడంతో వాహనదారులకు, స్థానిక ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది.

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై

## బీఆర్ఎస్ సమరభేరి

➤ సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు వారం రోజుల పాటు కార్యక్రమాలు

➤ 6 గ్యారెంటీలు, 420 హామీలపై ప్రజల్లోకి వెళ్లనున్న బీఆర్ఎస్




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరికి సిద్ధమైంది. సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనుంది. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన 6 గ్యారెంటీలు, 420 హామీల అమలు తీరుపై ప్రజలను చైతన్యపరచాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. గడపగడపకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం పూర్తిగా అమలు కాలేదని బీఆర్ఎస్ ఆరోపించింది. ఆరు గ్యారెంటీలతో పాటు వివిధ వర్గాలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించింది.

# అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సీ వీడ్కోలు

## అర్జెంటీనా స్టార్ రిటైర్మెంట్ ప్రకటన

## ప్రపంచకప్ ఫైనల్ ఓటమి తర్వాత నిర్ణయం



అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సీ వీడ్కోలు పలికారు. సోమవారం (ఆగస్టు 31) అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి రిటైర్ అవుతున్నట్లు మెస్సీ ప్రకటించారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానుల్లో తీవ్ర భావోద్వేగం నెలకొంది. అర్జెంటీనా జాతీయ జట్టు తరపున ఎన్నో చిరస్మరణీయ మ్యాచ్‌లు ఆడిన మెస్సీ.. అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకాలని నిర్ణయించుకోవడం ఫుట్‌బాల్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. ప్రపంచకప్ ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి అనంతరం రెండు రోజులకే అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు మెస్సీ వెల్లడించారు. ఫైనల్ ఓటమి తన నిర్ణయంపై ప్రభావం చూపిందని తెలిపారు. అయితే తన తండ్రి మరణం కూడా అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలకడానికి ప్రధాన కారణంగా మారిందని మెస్సీ పేర్కొన్నారు. వ్యక్తిగత విషాద పరిస్థితులు తనను ఈ నిర్ణయం వైపు నడిపించాయని వెల్లడించారు. మెస్సీ రిటైర్మెంట్ ప్రకటనతో అర్జెంటీనా అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆయన అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు. అర్జెంటీనా జాతీయ జట్టుకు ఎన్నో ఏళ్లుగా ప్రాతినిధ్యం వహించిన మెస్సీ.. తన అద్భుతమైన ఆటతీరుతో ప్రపంచ ఫుట్‌బాల్‌లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కీలక మ్యాచ్‌ల్లో జట్టును ముందుండి నడిపిస్తూ ఎన్నో విజయాల్లో కీలక పాత్ర పోషించారు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సీ వీడ్కోలు పలకడంతో అర్జెంటీనా జట్టులో ఒక శకం ముగిసినట్లయింది. ఆయన నిర్ణయంపై క్రీడా వర్గాలు, మాజీ ఆటగాళ్లు, అభిమానులు స్పందిస్తున్నారు. మెస్సీ అంతర్జాతీయ కెరీర్‌లో సాధించిన విజయాలు, అందించిన చిరస్మరణీయ ప్రదర్శనలు ఫుట్‌బాల్ చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోతాయని అభిమానులు పేర్కొంటున్నారు.

## మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వం లక్ష్యం

జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ లోగోల ఆవిష్కరణ

వెయ్యి రోజుల పాలనలో విప్లవాత్మక నిర్ణయాలు

రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

మూసారాంబాగ్ బ్రిడ్జి ప్రారంభ సభలో సిఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : మూసీ నదిపై మూసారాంబాగ్ వద్ద కొత్తగా నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని ప్రారంభించిన సందర్భంగా అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్థానికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ (జీహెచ్ఎంసీ), మల్కాజిగిరి (ఎంఎంసీ), సైబరాబాద్ (సీఎంసీ) మున్సిపల్ కార్పొరేషన్ల లోగోలను ఆవిష్కరించారు. నగరాభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం తెలిపారు. విధ్వంసానికి గురైన తెలంగాణను వికాసం వైపు నడిపించేందుకు గడిచిన వెయ్యి రోజుల ప్రజా ప్రభుత్వ పాలనలో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. రైతులు, మహిళలు, యువకులు, విద్యార్థులు, ఉద్యోగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేసినట్లు వివరించారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రభుత్వం పాలన సాగిస్తోందని పేర్కొన్నారు.

## ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

# చెలరేగిపోతున్న అక్రమార్కులు

- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు
- అధికారుల మౌనం ఎందుకు ?



ప్రస్తుతం ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలు



గతంలో ప్రభుత్వ భూమిలో అధికారులు చేపట్టిన అక్రమ నిర్మాణాల కూల్చివేతలు (ఫైల్)

రంగారెడ్డి – ప్రభాత సూర్యుడు :

ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాముల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 451లో 600 గజాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే నంబర్ 451లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని ఖబ్జా చేసి కొంతకాలంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, కళ్లకు కనిపించేలా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### గతంలోనూ ఆక్రమణలు

ఇదే సర్వే నంబర్‌లో సుమారు 600 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు గతంలో ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ఆ నిర్మాణాలను కూల్చివేశారు. అయితే కొంతకాలం తర్వాత మళ్లీ అదే ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. గతంలో చేపట్టిన కూల్చివేతలు తాత్కాలిక చర్యలుగానే మిగిలిపోయాయని, ప్రభుత్వ భూమిని శాశ్వతంగా కాపాడేందుకు చర్యలు తీసుకోకపోవడంతోనే ఆక్రమణలు మళ్లీ మొదలయ్యాయని అంటున్నారు.

### అధికారుల తీరుపై అనుమానాలు ?

సర్వే నంబర్ 451 లోగల 600 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి చేసట్టిన నిర్మాణాలను గతంలో రెవెన్యూ అధికారలు మట్నుక్కుబడిగానే చర్యలు చేపట్టారని, కేవలం పిర్యాదులు వస్తేనే తాత్కాలిక చర్యలు తీసుకొని చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వస్తున్న నేపద్యంలో, మళ్ళీ అక్రమార్కులు యదేచ్ఛగా ప్రభత్వ భూమిలో అక్రమ నిర్మాణలు చేపట్టడం వెనుక అధికారుల హస్తం ఉందని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అండదండలతోనే అక్రమార్కులు ప్రభుత్వ భూవిలోని చోరబదుతన్నారని వలువులు ఆరోపిస్తున్నారు.

### కంచె ఏర్పాటు చేయాలని డిమాండ్

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రైవేటు వ్యక్తులు భూమిలోకి ప్రవేశించకుండా సర్వే నంబర్ 451లో ప్రభుత్వ భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి, భూమి హద్దులను నిర్ధారించి పరిరక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరగకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రభుత్వంలో

# మార్పు కనిపించాలి



ప్రజలకు చేయాల్సింది ఇంకా చాలా ఉంది

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అవసరం

### గుత్తా సుఖేందర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

అభిప్రాయాలు ఉంటే పార్టీ అంతర్గతంగా చర్చించి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో అనేక వర్గాలు ఉంటాయని, ఎవరు ఏ వర్గంతో ఉంటారో స్పష్టంగా చెప్పడం కష్టమని అన్నారు. కొండా సురేఖ వ్యవహారంలో పార్టీ పరంగా చర్యలు తీసుకోవడం మంచిదని గుత్తా సుఖేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కొండా కుటుంబంపై చర్యలు తీసుకునే విషయంలో రెండు అవకాశాలు ఉన్నాయని, ఒకటి వేటు వేయడం కాగా, మరొకటి పునర్వ్యవస్థీకరణ ద్వారా సమస్యను పరిష్కరించడం అని పేర్కొన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన, ఎగువన ఉన్న కుటుంబాలకు సంబంధించిన అంశాలపై తాను పలు సూచనలు చేసినప్పటికీ ఇప్పటివరకు కార్యాచరణ జరగలేదని అన్నారు. ప్రభుత్వ వ్యవహారాల్లో సమాచార లీకేజీలను నియంత్రించాల్సిన అవసరం ఉందని సూచించారు. పాత పింఛన్లను పెంచాలని, తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## మహిష్మతి సామ్రాజ్యాన్ని తలపించేలా

# మధుర కన్వెన్షన్ అక్రమ నిర్మాణాలు

- వివాద స్థలంలో హెచ్‌ఎండీఏ అనుమతులు ఎలా?
- అడ్డదారిన అనుమతులు.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు?
- అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా..!
- నాగోల్ సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదుల వెల్లువ
- అటుగా కన్నెత్తి చూడని టౌన్ ప్లానింగ్ అధికారులు



బాహుబలి సినిమాలోని మహిష్మతి సామ్రాజ్యాన్ని తలపించేలా భారీ నిర్మాణాలు.. నిబంధనలు మాత్రం గాలికి వదిలేసినట్లుగా వ్యవహారం.. అనుమతులు ఒక విధంగా ఉంటే క్షేత్రస్థాయిలో నిర్మాణాలు మరో విధంగా సాగుతున్నాయన్న ఆరోపణలు.. ఇదీ పెద్ద అంబర్‌పేట్ డివిజన్‌లోని మధుర కన్వెన్షన్‌పై వినిపిస్తున్న విమర్శలు.






పెద్ద అంబర్‌పేట్ –ప్రభాత సూర్యుడు

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ నాగోల్ సర్కిల్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ డివిజన్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రాంతంలో మధుర కన్వెన్షన్ నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయంటూ స్థానికులు, పలువురు నాయకులు అధికారులకు ఫిర్యాదులు ఇస్తున్నారు. నిర్మాణాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయని సంబంధిత వర్గాలు చెబుతున్నప్పటికీ.. వాస్తవంగా జరుగుతున్న నిర్మాణాలు అనుమతులకు అనుగుణంగా ఉన్నాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.

### వివాదాస్పద భూముల్లో అనుమతులు ఎలా?

మధుర కన్వెన్షన్ నిర్మాణాలు జరుగుతున్నట్లు చెబుతున్న 234 నుంచి 239 సర్వే నంబర్ల పరిధిలో గతంలో భూ వివాదాలు, కోర్టు కేసులు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కొన్ని భూములు ఇప్పటికీ నిషేధిత జాబితాలో ఉన్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఆయా భూములకు నిర్మాణ అనుమతులు ఎలా మంజూరయ్యాయి? హెచ్‌ఎండీఏతో పాటు సంబంధిత మున్సిపల్ అధికారుల పరిశీలన ఏ మేరకు జరిగింది? భూముల చట్టపరమైన స్థితిని పరిశీలించిన తర్వాతే అనుమతులు ఇచ్చారా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

### అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా?



నిర్మాణ అనుమతుల్లో పేర్కొన్న నిబంధనలు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న నిర్మాణాలు ఒకే విధంగా ఉన్నాయా లేదా అన్నది అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు. భవన నిర్మాణ అనుమతులు, భూవినియోగం, నిర్మాణ విస్తీర్ణం, రహదారి నిబంధనలు, పార్కింగ్, ఇతర టౌన్ ప్లానింగ్ నిబంధనలను అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### ఫిర్యాదుల వెల్లువ.. చర్యలు ఎక్కడ ?

మధుర కన్వెన్షన్‌కు సంబంధించి నాగోల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగానికి పలుమార్లు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ ఇప్పటివరకు అధికారులు నిర్మాణ ప్రదేశాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులు వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వాస్తవాలను నిర్ధారించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు అంటున్నారు. అయితే అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ముడుపుల ఆరోపణలు..

అక్రమ నిర్మాణాలకు కొందరు అధికారులు, గతంలో పనిచేసిన మాజీ ప్రజాప్రతినిధులు సహకరిస్తున్నారంటూ స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఓ ఉన్నతాధికారి, కొందరు మాజీ కౌన్సిలర్లు భారీ ఎత్తున ముడుపులు పుచ్చుకొని అక్రమ అనుమతులకు ప్రోత్సహించారన్న ఆరోపణలు కూడా ప్రచారంలో ఉన్నాయి.


### ఎదురుగా మరో భారీ నిర్మాణం?

మధుర కన్వెన్షన్‌కు ఎదురుగా మరో భారీ షెడ్ నిర్మాణం చేపడుతున్నారని, దానికి కూడా ఇదే తరహాలో అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, స్థల వివరాలు, నిర్మాణ ప్రణాళిక, క్షేత్రస్థాయి పరిస్థితులపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. **మొత్తంగా మధుర కన్వెన్షన్ నిర్మాణాలపై వస్తున్న ఫిర్యాదులు, భూ వివాదాలు, అనుమతులు, క్షేత్రస్థాయి నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు కోరుతున్నారు. ఫిర్యాదుల నేపథ్యంలో నాగోల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.**






## కేంద్రమంత్రి పదవి నుంచి నితిన్ గడ్కరీ ఔట్?



న్యూఢిల్లీ , ప్రభాత సూర్యుడు

కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై ఊహాగానాలు కొనసాగుతున్న వేళ.. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కొత్త తరానికి బాధ్యతలు అప్పగించాల్సిన సమయం వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు.

### కొత్త తరానికి బాధ్యతలు


తాను మునుపటిలా ఎక్కువ సమయం పని చేయలేకపోతున్నానని గడ్కరీ పేర్కొన్నారు. ఇకపై సామాజిక సంక్షేమం, రైతుల శ్రేయస్సుపై ఎక్కువగా దృష్టి సారించాలనే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించారు.

### గడ్కరీ వ్యాఖ్యలతో ఊహాగానాలు

కేంద్ర కేబినెట్‌లో మార్పులు జరుగుతాయన్న వార్తల నేపథ్యంలో గడ్కరీ వ్యాఖ్యలు ప్రాధాన్యతసంతరించుకున్నాయి. ఆయన నిజంగానే కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పుకోబోతున్నారా? లేక తన రాజకీయ భవిష్యత్తుపై సాధారణ వ్యాఖ్యలు చేశారా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. అయితే, గడ్కరీ కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పుకుంటున్నట్లు అధికారిక ప్రకటన వెలువడలేదు. కాబట్టి ప్రస్తుతం ఇది రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ఊహాగానాలుగానే చూడాలి.

## ఉచితంగా ఆధార్ కార్డు అప్‌డేట్

### సెప్టెంబర్ 30 వరకు ఛాన్స్




న్యూఢిల్లీ , ప్రభాత సూర్యుడు

చిన్న వయసులో ఆధార్ తీసుకున్న పిల్లల బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసేందుకు ఖ×ణూ× ఉచిత అవకాశం కల్పిస్తోంది. 5 నుంచి 15 ఏళ్ల మధ్య వయసున్న పిల్లల ఆధార్‌లో వేలిముద్రలు, ఐరిస్ వంటి బయోమెట్రిక్ వివరాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేయించాలి. ఈ సేవను సెప్టెంబర్ 30 వరకు ఉచితంగా పొందే అవకాశం ఉంది. ఐదేళ్లలోపు పిల్లలకు జారీ చేసే బాల ఆధార్‌లో సాధారణంగా బయోమెట్రిక్ వివరాలను నమోదు చేయరు. దీంతో పిల్లలకు ఐదేళ్లు పూర్తైన తర్వాత వేలిముద్రలు, ఐరిస్ వంటి వివరాలను ఆధార్‌లో అప్‌డేట్ చేయడం కీలకంగా మారుతుంది. అలాగే 15 ఏళ్లు పూర్తైన తర్వాత మరోసారి బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. పిల్లల వయసుకు అనుగుణంగా బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేయడం ద్వారా ఆధార్‌లోని సమాచారం తాజా వివరాలతో కొనసాగుతుంది. సెప్టెంబర్ 30 తర్వాత ఇదే సేవకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి అర్హత ఉన్న పిల్లల తల్లిదండ్రులు గడువు ముగిసేలోపు ఆధార్ బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## బురుగుపల్లి ప్రధాన రహదారిపై చెత్త వేస్తే రూ.10 వేల జరిమానా



### చెత్త వేస్తున్న వారిని పట్టించిన వారికి రూ.1,000 నగదు బహుమతి

ప్రభాత సూర్యుడు– సిద్దిపేట

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో బురుగుపల్లి గ్రామపంచాయతీ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామంలోని ప్రధాన రహదారిపై చెత్త వేయడం, వ్యర్థాలను పడేయడాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రకటించారు. ప్రధాన రహదారిపై చెత్త వేస్తూ పట్టుబడిన వారికి రూ.10,000 జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

అంతేకాకుండా చెత్త వేస్తున్న వ్యక్తులను ఫొటో లేదా వీడియో ఆధారాలతో గ్రామపంచాయతీ దృష్టికి తీసుకువచ్చి పట్టించడంలో సహకరించే వారికి రూ.1,000 నగదు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు. గ్రామంలో పారిశుధ్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని గ్రామపంచాయతీ కోరింది. చెత్తను గ్రామపంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త సేకరణ విధానంలోనే అందజేయాలని సూచించింది. బురుగుపల్లి గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమని గ్రామపంచాయతీ ప్రతినిధులు తెలిపారు.

# సంపాదకీయం

## ట్రంపరితనంను ఎదురించాల్సిందే !

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హద్దుమీరి ప్రవర్తిస్తున్న తీరు మరోమారు ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఏ దేశం ఎవరితో దోస్తానా చేయాలో..ఎవరితో వాణిజ్యం చేయాలో అన్న ఆంక్షలు విధించే హక్కు ట్రంప్‌కు ఎక్కడిదని ప్రశ్నించాలి. ఈ విషయంలో మోడీ దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టాలి. ట్రంప్ ఆంక్షలను అంగీకరించేది లేదని గట్టిగానే చెప్పాలి. చర్చలు జరిపేది లేదంటున్న ట్రంప్‌తో మనం కూడా అంతే మొండి వైఖరితో ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో చెప్పగలగాలి. ఒకవైపు మనపై వాణిజ్య ఆంక్షలు విధిస్తూ..మరోవైపు పాక్‌ను దువ్వుతున్న తీరు అమెరికా ద్వంద్వ నీతిని తెలియ చేస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు తీవ్ర దుమారం రేపుతున్న వేళ ట్రంప్ ఏ మాత్రం తగ్గేది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో రెండు దేశాల మధ్య ఓ రకంగా విభేదాలు పొడసూపి నట్లుగానే భావించాలి. ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు భారత్‌కు పరీక్షగా మారాయి. ఈక్రమంలో మోడీ కూడా మనదేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటూనే ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను తమపై విధించడంతో భారత్ దీటుగా స్పందించింది. తమ దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాల ఉత్పత్తుల రంగంలోని వారి ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసింది. అవసరమైతే ఆ భారాన్ని తామే భరిస్తామని వెల్లడించింది. మరోవైపు భారత్‌పై మరిన్ని ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇక ఆయన విధించిన సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీనివల్ల అమెరికాలో కొన్నింటి ధరలు పెరగనున్నాయి. అయితే, అమెరికా అదనపు సుంకాల వల్ల రెండు దేశాల మధ్య తలెత్తిన వివాదం తాత్కాలికమేనని, త్వరలోనే సమసిపోతుందని ప్రవాస భారతీయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. చర్చలు ఫలించి త్వరలో ఒప్పందం కుదరనుందనే ఆశాభావం వ్యక్తం చేశాయి. 50 లక్షల మంది ప్రవాస భారతీయులు అమెరికా అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. భారతీయ ఉత్పత్తులపై 50శాతం సుంకాలను వేయడాన్ని ఇండియన్-అమెరికన్ల నేత, బైడెన్ మాజీ సలహాదారు అజయ్ భుటోరియా ఖండించారు. 'అమెరికాలో తక్కువ ధరలకు లభించే 50శాతం జనరిక్ మందులను భారత్ సరఫరా చేస్తోంది. ఈ సుంకాలు వాటి ధరలను పెంచుతాయి. దీనివల్ల అమెరికాలోని కుటుంబాలు, సీనియర్ సిటిజన్లు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడతారు. మసాలా దినుసులు, పప్పులు, దీపావళి దుస్తుల ధరలు పెరుగుతాయని పేర్కొన్నారు. దుస్తులు, పాదరక్షల ధరలు 37శాతం దాకా పెరగవచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఎలా ఉన్నా మనం కూడా తగ్గేదేలా లేదన్నట్లుగా వ్యవహ రించాలి. కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ ఇదే విషయాన్ని గుర్తుచేశారు.. ట్రంప్ విధించిన అదనపు సుంకాలపై ప్రధాని మోదీ గట్టిగా సమాధానమిచ్చారు. తమ రైతుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీ పడబోమని, దానికి ఎంత మూల్యమైనా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలే మాకు అత్యంత ముఖ్యం. రైతులు, మత్స్యకారులు, డెయిరీ ఉత్పత్తిదారుల ప్రయోజనాల విషయంలో భారత్ ఎప్పటికీ రాజీ పడబోదు. వారిని కాపాడటం కోసం సుంకాల భారాన్ని సొంతగా భరించడానికీ సిద్ధం అని ప్రధాని స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొంటుందన్న కారణంతో భారత్‌పై 50శాతం సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో బాంబు పేల్చారు. తదుపరి మరిన్ని ఆంక్షలను చూస్తారంటూ హెచ్చరించారు. శ్వేత సౌధంలోని ఓవల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'భారత్‌పై మేం 50శాతం సుంకాలను విధించిన విషయం మీకు తెలుసు. ఆ దేశం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో రెండో స్థానంలో ఉంది. తొలిస్థానంలో ఉన్న చైనాకు అతి దగ్గరగా ఉంది. అందుకే భవిష్యత్తులో మరిన్ని ఆంక్షలను చూడబోతున్నారని పేర్కొన్నారు. ట్రంప్ తీరు చూస్తుంటే పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది. తన వైఖరిని నెగ్గించుకోవడమే ఆయనకు ముఖ్యంగా ఉంది. ఎలన్ మస్క్ లాంటి వారినే దూరం పెట్టిన ట్రంప్‌కు భారత్ ప్రయోజనాలు ముఖ్యం కాదు. ఇకపోతే ఆపరేషన్ సింధూర్ తరవాత భారత్ సైనికంగా బలపడడంతో కూడా ట్రంప్ తట్టుకోవడం లేదని తెలుస్తోంది. ఇది కూడా ట్రంప్ వైఖరికి కారణం కావచ్చని వశ్లేషిస్తున్నారు. భారత్‌పై గతంలో విధించిన 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. అదనంగా విధించిన మరో 25శాతం ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. మన దేశంతోపాటు అనేక దేశాలపై సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. దీనివల్ల బిలియన్ల కొద్దీ డాలర్లు అమెరికాకు వస్తాయని ట్రంప్ ప్రకటించారు. ఈ సుంకాలు 10శాతం నుంచి 50శాతం దాకా ఉన్నాయి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత గత పదకొండేళ్లుగా ఇలా ఎప్పుడూ జరగలేదు. అవినీతిరహితంగా పాలన సాగుతుందన్న పేరు వచ్చింది. అలాగే సాహసోపేత నిర్ణయాలు కూడా తీసుకుని సత్తా చాటింది. అయోధ్య, కాశ్మీర్, ట్రిపుల్ తలాక్ విషాయల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సైనిక సత్తా చాటాం. పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పాం. ప్రపంచవ్యాప్తంగా భారత్చర్యలకు గట్టి మద్దతు లభించింది. మోడీ సర్కార్ సాహస నిర్ణయాలకు వెనకాడదని రుజువు చేసుకుంది. సర్జికల్ స్ట్రయిక్స్ తరవాత, ఆపరేషన్ సిందూర్తరవాత కూడా పాక్ వైఖరిలో మార్పు రాలేదు. దాయాది దేశాన్ని ప్రపంచంలో దోషిగా నిలబెట్టిన ఘనత మోడీదే అని చెప్పక తప్పదు. ట్రంప్ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో అని దేశం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో భారత్ తన సార్వభౌమాధికరం ముఖ్యమని చాటి చెప్పాలి.

## మా భూములకు రక్ష కెటిఆర్ అన్న



మొదటి పేజీ తరువాయి

అధికారులు, పోలీసులు దౌర్జన్యం చేశారని, ఆమె భర్తను జైలుకు పంపిన, సమయంలో కేటీ-ఆర్ ఢిల్లీ వెళ్లి పలు కమిషన్లకు ఫిర్యాదులు చేసి, జ్యోతితో పాటు- లగచర్ల గిరిజనులకు, పేద రైతన్నలకు జరుగుతున్న అన్యాయాన్ని ఢిల్లీ వేదికగా ఎండగట్టారు. దీని ఫలితంగా, ప్రభుత్వం భూసేకరణను వెనక్కి తీసుకుందని వారు తెలిపారు. కేసుల కారణంగా జైలుపాలైన లగచర్ల సోదర సోదరీమణులందరికీ కేటీఆర్ అన్నగా అండగా నిలబడి, న్యాయ సహాయం అందించారని, అందరినీ జైలు నుంచి విడిపించారని వారు తెలియజేశారు.

## ప్రైవేట్ డ్రైవర్లనూ వదలని సర్కార్

### బీమా ఎగ్గొట్టారని మండిపడ్డ కెటిఆర్



హైదరాబాద్-ప్రభాత సూర్యుడు

కేవలం 20 నెలల్లోనే అన్ని వర్గాలను వంచించిన దగాకోరు రేవంత్ సర్కార్.. ప్రైవేట్ రంగంలోని డ్రైవర్లను సైతం నట్టేట ముంచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు అసంఘటితరంగ కార్మికులకు, గిగ్ వర్కర్లకు అరచేతిలో వైకుంఠం చూపించిన రేవంత్.. గద్దెనెక్కాక ఉన్న పథకాన్ని కూడా ఊడగొట్టాడు! అని ధ్వజమెత్తారు.మహోదాత్త హృదయంతో, మానవీయ కోణంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన డ్రైవర్లకు రూ. 5 లక్షల ప్రమాద బీమా పథకానికి ఇన్స్యూరెన్స్ ప్రీమియం ఎగ్గొట్టి, కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ పెట్టింది.. నిరుపేద డ్రైవర్ల కుటు-ంబాలకు క్షోభను మిగిల్చింది అని కేటీ-ఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. 2024 అక్టోబర్ నుండి పథకాన్ని ఆపేసి.. ప్రమాదవశాత్తు మరణించిన డ్రైవర్ల కుటు-ంబాలను రేవంత్ రోడ్డున పడేశాడు అని కేటీ-ఆర్ పేర్కొన్నారు. రైతు బీమా, నేతన్నకు బీమా, డ్రైవర్లకు బీమా వంటి ఎన్నో పథకాలతో సబ్బండ వర్ణాల ప్రజల భవిష్యత్తుకు కేసీఆర్ ధీమా అందిస్తే.. ఒక్కో పథకానికి మంగళం పాడి పేద కుటు-ంబాల భవిష్యత్తును అగమ్యగోచరంగా మారుస్తోంది ఈ కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వం. రూ. 5 లక్షల ప్రమాద బీమా పథకాన్ని తిరిగి ప్రారంభించాలని, పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే సెటిల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.. లేకుంటే డ్రైవర్ల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి, ఈ అమానవీయ సర్కార్ మెడలు వంచుతామని కేటీఆర్ హెచ్చరించారు.

## అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తికి ఊరట

### నిషేధిత ఉత్తర్వులను వెనక్కి తీసుకున్న సుప్రీం

న్యూఢిల్లీ-ప్రభాత సూర్యుడు

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తికిఊరట దక్కింది. గంతలో విధించిన నిషేధ ఉత్తర్వులను సుప్రీం వెనక్కు తీసుకుంది. హైకోర్టు జడ్జిపై ఆంక్షల విషయంలో గతంలో వెలువరించిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఉ పసంహరించుకుంది. అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి రిటైరయ్యేంతవరకూ ఆయనకు క్రిమినల్ కేసులు అప్పగించకూడదని ఆంక్షలు విధిస్తూ ఈనెల 4న వెలువరించిన ఉత్తర్వులను ఉప సంహరించుకుంటున్నట్లు పేర్కొంది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అభ్యర్థన మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం దీనిని వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు విషయంలో తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నుంచి తమకు లేఖ అందిందని ధర్మాసనం పేర్కొంది. సంబంధిత న్యాయమూర్తికి ఇబ్బందులు కలిగించడం తమ ఉద్దేశం కాదని.. అయితే కొన్ని విషయాల్లో పరిమితులు దాటినప్పుడు న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడటమే కోర్టు పనిచేస్తుందని జస్టిస్ పార్దివాలా పేర్కొన్నారు. అంతకు ముందు ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నప్పటికీ అలహాబాద్ హైకోర్టు తీర్పు చట్టవిరుద్ధమని ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఇటువంటి ఆదేశాలను విస్మరించలేమని స్పష్టం చేశారు. ఒక సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యలకు అనుమతినిస్తూ అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి ఇటీవల జారీచేసిన ఆదేశాలకు సంబంధించిన కేసులో రి-టైరయ్యేంత వరకూ ఆయనకు ఎలాంటి క్రిమినల్ కేసులు అప్పగించవద్దని ఈనెల 4న సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశంలోని కొన్ని అంశాలు అమలుకాకుండా నిరోధించేందుకు ఫుల్ కోర్టును సమావేశపరచాలని అలహాబాద్ హైకోర్టుకు చెందిన 13 మంది న్యాయమూర్తులు గురువారం అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఒక లేఖ రాశారు. హైకోర్టులపై పాలనాపరమైన పర్యవేక్షణ అధికారం సుప్రీంకోర్టుకు లేదని, అందుకే ఆగస్టు 4నాటి సుప్రీం ఆదేశాల్లో 24వ, 26వ పేరాల్లోని నిర్దేశాలను అమలుచేయరాదని ఫుల్‌కోర్టు తీర్మానించాలని జడ్జీలు కోరారు. ఈ నేపథ్యంలో 'సుప్రీం' తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

# అలీబాబా 40 దొంగలు

- కెసిఆర్ కుటుంబానికి ఇది సరిపోతుంది
- అప్పులు చేసి దోచుకోవడంలో అందవేసిన చేయి
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




హైదరాబాద్-ప్రభాత సూర్యుడు

తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అడ్డంగా దోచుకున్నారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. ఎంత దొరికితే అంత దోచుకున్నారని విమర్శించారు. అప్పులుల తెచ్చి అప్పుల్లోనూ కమిషన్లు దండుకున్న ఫ్యామిలీ వారిదని మండిపడ్డారు. శుక్రవారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఇంకా చెప్పాలంటే అంచనా వేయలేనంతగా రాష్ట్రాన్ని దోచి పడేశారని తెలిపారు. అవినీతి ఎలా చేయాలో అనే యూనివర్సిటీకి కేసీఆర్ ప్రొఫెసర్ అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రజల ఖజానా దోచుకోవడంలో కేసీఆర్ ఫ్యామిలీ దిట్ట అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకొని.. సుద్దపూసలాగా.. నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని కేసీఆర్ ఫ్యామిలీపై నిప్పులు చెరిగారు. అలీబాబా నలభై దొంగలు అనే -టైటిల్ కేసీఆర్ ఫ్యామిలీకి కరెక్ట్ సెట్ అవుతుందని స్పష్టం చేశారు. వారు స్థాపించిన పార్టీలోని కొత్త ప్రభాకర్ సుద్దపూసలాగా మాట్లాడుతున్నాడని చెప్పారు. ప్రజలకి ఏమైనా చేద్దామంటే ఖజానాలో మిగుల్చకుండా దోచుకొని పోయారంటూ కేసీఆర్ ఫ్యామిలీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ నేత, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై జగ్గారెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. నువ్వు నా క్యారెక్టర్ అంచనా వేయలేవంటూ కొత్త ప్రభాకర్ రెడ్డికి సూచించారు. రాష్ట్రంలో ఎవర్ని అడిగినా నా క్యారెక్టర్ గురించి చెబుతారన్నారు. నా క్యారెక్టర్‌కి, ప్రభాకర్ రెడ్డి క్యారెక్టర్‌కి చాలా తేడా ఉంటు-ందని పేర్కొన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఉన్నంత ఆస్తి నా వద్ద ఉంటే ప్రజలకి ఎప్పుడో పంచేసే వాడినని తెలిపారు. పంచే గుణం మా అమ్మనాన్న నాకు ఇచ్చిన ఆస్తి అని చెప్పారు. భవిష్యత్తులో నేను రూ. వేల కోట్లు- సంపాదించినా వాటిని ప్రజలకే పంచుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. నా ఆస్తి నా పిల్లల కోసం కాదని.. ప్రజల కోసమని తెలిపారు. రూ. 1000 కోట్లు- కొన్ని గంటల్లోనే పంచేస్తానన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఎలా పంచాలో కూడా తెలియదని ఆక్షేపించారు. నేను ఎలాంటి వాడినో కేసీఆర్, హరీష్ రావుని అడిగి తెలుసుకోవాలంటూ ప్రభాకర్ రెడ్డికి సూచించారు. కొత్త ప్రభాకర్ రెడ్డి.. నీవు మగాడవయితే నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ రెడ్డిది నా స్థాయి కాదన్నారు. కొన్ని విషయాల్లో ఎమోషనల్ కావ్వడం నా బలహీనత అని తెలిపారు. ప్రజల సమస్య వింటే వాళ్ళ కంటే ముందు నాకే ఏడుపు వస్తుందన్నారు. నా చుట్టూ పేదలు ఉంటారని.. నా వద్దకు క్యాన్సర్ పేషెంట్లు- సైతం వస్తారని చెప్పారు. నేనేమైనా ప్యాకేజీల లీడర్ నా అంటూ బీఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా జగ్గారెడ్డి సూటిగా ప్రశ్నించారు. నేనేమి బీ ఫారంలు కొనుకొని రాలేదని వ్యంగ్యంగా అన్నారు. దొంగతనాలు మీరు చేసి.. మాపై నిందలు వేస్తారా? అంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మీలాగా ప్రైవేట్ కంపెనీనా? అని వారిని నిలదీశారు. ఇసుక దందాలలో మీరు సంపాదించింది ఎంత? అంటూ ఆ పార్టీ నేతలను ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని భూములు, చెరువులు కబ్జా చేసింది బీఆర్ఎస్ నాయకులేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## ఫసల్ బీమా యోజనతో రైతులకు అండ

### ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో ఆనందం




హైదరాబాద్-ప్రభాత సూర్యుడు

కేంద్రం తీసుకుని వచ్చిన ఫసల్ బీమాలో చేరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రైతులకు మేలు జరుతుందని కూడా తెలిపింది. రైతులను ఆదుకునే క్రమంలో పసల్ బీమా యోజనలో చేరడం, రైతల కిస్తీకూడా ప్రభుత్వమే భరిస్తుందిన సిఎం, డిప్యూటి సిఎంలు కూడా వెల్లడించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది..ప్రకృతి కరుణించక అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతూ... ఇక వ్యవసాయం వద్దు అనుకునే రైతన్నకు ప్రధానమంత్రి ఫసల్ భీమ యోజన అండగా నిలుస్తోంది. దేశానికి వెన్నుముక రైతు , రైతు పంటలు పండిస్తేనే ప్రజలకు ఐదు వేళ్ళు నోట్లోకి వేలుతాయి. అలాంటి రైతు తాము పండించిన పంటకు అకాల వర్షాలతోనో అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతే అ రైతు పరిస్తితి ఏంటి అనుకునే తరుణంలో ఫసల్ బీమాయోజన వారికి ఆసరాగా నిలిచింది. పంట నష్టపోయిన రైతన్నను అమ్మలా అదుకుంటూతుంది. వ్యవసాయం దండుగ అని గతంలో అన్న రైతుకు వ్యవసాయం పండుగా అనేలా ప్రతి రైతు ప్రకృతి వైపరీత్యాలకు బెదరకుండా తమ భూమిని సాగు చేసి వ్యవసాయాన్ని చేసే దైర్యాన్ని ఇస్తుంది.. ఫసల్ బీమా యోజన పథకం. రైతు తాము పండించే పంట పెట్టుబడి ఎకరాకు అందులో రెండు శాతం ఫసల్ బీమా పథకం ప్రీమియం కడితే చాలు వరిపంటకు ఎకరాకు 34 వేల బీమా ఉండగా అందులో రెండు శాతం అంటే 680 రూపాయలు ప్రీమియం కడితే చాలు అలగే మొక్క జొన్న ... వేరుశనిగే పంటలకు రెండు శాతం ఉండగా పసుపు పంటకు మాత్రం 3.5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంది.. దీంతో రైతుకు ఎదురయ్యే ఇబ్బందులు తెగుళ్ళు .. వడగళ్ళు.. పిడుగులు.. అకాల వర్షాలతో పంట నష్టపోతే ఆ రైతుకు ఫసల్ బీమా రక్షణగా నిలుస్తుంది.. వీటితో పాటు ఇందులోనే వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ద్వారా పత్తి పంటతో పాటు మిర్చిపంటకు కూడా రైతు 5 శాతం ప్రీమియం చెల్లిస్తే వాతావరణం అనుకులించ కున్న వేసిన విత్తనం మొలకేత్తకపోయిన రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంట పెట్టుబడి నష్ట పోకుండా ఫసల్ బీమా పథకం అండగా నిలుస్తుంది. పంటకోత తర్వాత జరిగే నష్టాలకూ బీమా వర్తిస్తుంది. పంటనష్టం జరిగిందని తెలియగానే బీమా మొత్తంలో 25 శాతం మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. అంతేకాదు క్లెయిమ్ సెటిల్ కోసం పంట నష్టాన్ని అంచనా వేయటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడతారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా పంట కోత సమాచారాన్ని ఫొటోలు తీసి, అప్‌లోడ్ చేస్తారు. గతంలో ఎన్నో పంట బీమా పథకాలు ఉన్న కూడా తాము అకాల వర్షాలతో నష్టపోయే వాళ్ళమని... ఇప్పుడు ఫసల్ బీమాపై వ్యవసాయ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు అవగాహన కల్పించడంతో తాము వ్యవసాయం అంటే కష్టం కాదని వ్యవసాయాన్ని ఇష్టంతో చేసుతున్నామని రైతులు తెలుపుతున్నారు.

# యూట్యూబ్‌ను షేక్ చేస్తున్న ‘ఎశ నాగుల కట్ట మీద’ పాట




హైదరాబాద్: నేచురల్ స్టార్ నాని, కీర్తి సురేష్ జంటగా నటిస్తున్న ‘ది ప్యారడైజ్’ చిత్రంలోని ‘ఎశ నాగుల కట్ట మీద’ పాట యూట్యూబ్‌లో దూసుకెళ్తోంది. పాట విడుదలైన కొద్ది గంటల్లోనే మిలియన్ల వ్యూస్ సాధించి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తెలంగాణ జానపద నేపథ్యంలోని పాటను కొత్త తరహాలో రీక్రియేట్ చేసి సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ అద్భుతమైన బీట్‌ను అందించారు. జానపద సొబగులకు మాస్ బీట్‌ను జోడించడంతో పాటకు ప్రత్యేకమైన ఊపు వచ్చింది. పాట విడుదలైన వెంటనే అభిమానులు, సంగీత ప్రియుల నుంచి మంచి స్పందన వస్తోంది. పాటలో నాని, కీర్తి సురేష్ వేసిన మాస్ స్టెప్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ ఫోక్ ఫ్లేవర్‌కు తగ్గట్టుగా రూపొందించిన పాటలో ఇద్దరి డ్యాన్స్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా నాని మాస్ లుక్, స్టెప్పులు పాటకు మరింత క్రేజ్ తీసుకొచ్చాయి. ‘ఎశ నాగుల కట్ట మీద’ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. జంగిరెడ్డి, ప్రభా బంగారిగల్ల తమ గాత్రంతో పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. తెలంగాణ జానపద శైలిని ఆధునిక సంగీతంతో మేళవించిన ఈ పాట ప్రస్తుతం యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. పాట విడుదలైన గంటల్లోనే మిలియన్ల వ్యూస్ సాధించడం ‘ది ప్యారడైజ్’పై ఉన్న అంచనాలను మరోసారి చాటిచెబుతోంది. పాటకు వస్తున్న స్పందనతో చిత్రబృందం కూడా ఆనందం వ్యక్తం చేస్తోంది. సోషల్ మీడియాలో పాటకు సంబంధించిన వీడియోలు, రీల్స్ వైరల్ అవుతున్నాయి. తెలంగాణ ఫోక్ టచ్, అనిరుధ్ మ్యూజిక్, నాని--కీర్తి సురేష్ మాస్ డ్యాన్స్ కలిసి ‘ఎశ నాగుల కట్ట మీద’ పాటను మ్యూజిక్ లవర్స్‌లో హాట్ టాపిక్‌గా మార్చాయి.





# తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ.. సర్వదర్శనానికి 10-12 గంటలు



తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల రద్దీ స్వల్పంగా తగ్గింది. ఉచిత దర్శనం కోసం 20 కంపార్ట్మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. ఉదయం 8 గంటల తర్వాత సర్వదర్శనానికి వెళ్లే భక్తులకు 10 నుంచి 12 గంటల సమయం పడుతోంది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 నుంచి 4 గంటల సమయం పడుతున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. సర్వదర్శనం టోకెన్లు పొందిన భక్తులకు స్వామివారి దర్శనానికి 3 నుంచి 5 గంటల సమయం పడుతోంది. రద్దీకి అనుగుణంగా దర్శన సమయాల్లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిన్న 85,246 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 34,085 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీ ద్వారా రూ.4.30 కోట్ల ఆదాయం లభించింది. భక్తులకు అందుబాటులో ఉంచిన లడ్డూ ప్రసాదాల్లో నిన్న మొత్తం 4.51 లక్షల లడ్డూలను విక్రయించారు. తిరుమలలో 2.23 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. వివిధ కారణాలతో 3,081 మంది భక్తులు వైద్య సేవలు పొందారు. భక్తుల రద్దీ స్వల్పంగా తగ్గినప్పటికీ తిరుమలలో దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగానే కొనసాగుతోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# హైదరాబాద్‌లో వరల్డ్ క్లాస్ క్రికెట్ స్టేడియం

## 1.32 లక్షలకు పైగా సీటింగ్!



హైదరాబాద్-ప్రభాత సూర్యుడు : తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు రాబోతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రపంచ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతిపాదిత స్టేడియం నిర్మాణం పూర్తయితే హైదరాబాద్‌కు అంతర్జాతీయ క్రికెట్ మ్యాప్‌లో మరింత ప్రత్యేక గుర్తింపు లభించే అవకాశం ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియాల్లో ఒకటిగా నిలిచేలా ఈ స్టేడియాన్ని నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుత గుజరాత్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం కంటే భారీగా, 1.32 లక్షలకు పైగా ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యంతో దీనిని నిర్మించే ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది.

### అంతర్జాతీయ ప్రమాణాలతో..

లండన్‌లోని లార్డ్స్, ఆస్ట్రేలియాలోని ప్రముఖ క్రికెట్ స్టేడియాల తరహాలో ఆధునిక సౌకర్యాలతో స్టేడియాన్ని నిర్మించాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రేక్షకుల సౌకర్యాలతో పాటు అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ఇందులో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

### బీసీసీఐ భాగస్వామ్యంపై ఆలోచన

స్టేడియం నిర్మాణం, నిర్వహణలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భాగస్వామ్యాన్ని తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. దీనివల్ల అంతర్జాతీయ స్థాయి క్రికెట్ మ్యాచ్‌లు, దేశవాళీ టోర్నమెంట్లు నిర్వహించేందుకు హైదరాబాద్‌కు మరిన్ని అవకాశాలు లభించే అవకాశం ఉంది.

### ఫ్యూచర్ సిటీలో నిర్మాణం

భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఫ్యూచర్ సిటీలో ఈ భారీ క్రికెట్ స్టేడియాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. స్టేడియం నిర్మాణం పూర్తయితే క్రీడా రంగంలో హైదరాబాద్ స్థాయి మరింత పెరగడంతో పాటు, అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లకు నగరం ప్రధాన వేదికగా మారే అవకాశం ఉంది. అయితే స్టేడియం నిర్మాణానికి సంబంధించిన తుది స్థలం, వ్యయం, నిర్మాణ కాలపరిమితి, అధికారిక సామర్థ్యం వంటి వివరాలపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

Printed by RATNA GRAPHICS, At H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana.
Published by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS, Printed at HYDERABAD and Pulblished at H.No: 7-83/2, HANUMAN NAGAR, KUNTLOOR, ABDULLAPUR MET MANDAL,Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City,Telangana.
Editor : CHERUKU UPENDAR, E-mail: prabhathasuryudueditor@gmail.com PRGI Reg No : TGTEL/25/A0555